క్లుప్తంగా

పాఠశాలకు రిఫ్రిజిరేటర్ అందజేత



పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాస్లాబాద్‌లోని ప్రాథమిక పాఠశాలకు శనివారం పెద్దకొడప్‌గల్ కెనరా బ్యాంక్ తరఫున వచ్చిన రిఫ్రిజిరేటర్‌ను కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రావణ్ అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రావణ్ మాట్లాడుతూ.. బ్యాంకు తరఫున చేస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా పాఠశాలకు రిఫ్రిజిరేటర్‌ను అందజేశామని తెలిపారు. బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మురళి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలి



భిక్కనూరు: ముదిరాజులను బీసీ-డి నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామ ముదిరాజులు శనివారం తీర్మానం చేశారు. ఈమేరకు ముదిరాజు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజు సంఘం అధ్యక్షుడు గజ్జెల భిక్షపతి, మండల అధ్యక్షుడు బండి రాములు, జంగంపల్లి ముదిరాజు సంఘం అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఫ్లెక్సీ చించివేత.. క్షమాపణ చెప్పిన కార్యకర్త



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలను కాంగ్రెస్ కార్యకర్త చింపేశారు. యువజన కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర నేతలు వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలను చింపేశారు. దీంతో ఆగ్రహించిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ నాయకుల వాహనాలను అడ్డుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించి చింపేసిన కార్యకర్త ద్వారా క్షమాపణ చెప్పించడంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు శాంతించారు.

వైభవంగా ఆకాశ దీపోత్సవం



కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణ శివారులోని ఇల్చిపూర్‌లో కొలువుదీరిన సరస్వతి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆకాశ దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దత్తాద్రి శర్మ, విజయ్ పాండేల ఆధ్వర్యంలో ఆకాశ కార్తీక దీపంను, వేద మంత్రోచ్ఛరణాముల మధ్య వెలిగించారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలాల సిద్ధాగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వరాల లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



మాచారెడ్డి: లచ్చాపేటలో శనివారం ధర్మపురి వరాల లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామకోటి జపయజ్ఞ ప్రచారకుడు కృష్ణానందస్వామి కార్తీక పురాణం విశిష్టత గురించి వివరించారు. కల్యాణం అనంతరం తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

బీఆర్‌ఎస్ నాయకుల సమావేశం



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాదు ల సత్యనారాయణ, సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ పాల్గొన్నారు.

కాయితీ లంబాడాలకు పట్టాలిస్తాం

- గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చా
- ఎల్లారెడ్డి అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి సురేందర్



గాంధారిలో ప్రచారానికి వచ్చిన జాజాల సురేందర్‌కు హారతులిస్తున్న మహిళలు

గాంధారి(ఎల్లారెడ్డి): అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో ఉన్న కాయితీ లంబాడీ రైతులకు పోడు భూముల పట్టాలు ఇస్తామని ఎల్లారెడ్డి అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ అన్నారు. శనివారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. చద్మల్ తండా లక్ష్మమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రచారం ప్రారంభించారు. చద్మల్ తండా, చద్మల్, నేరల్, నేరల్ తండా, నాగ్లూర్, నాగ్లూర్ తండా, పిప్కిల్ గుట్ట తండా, పెద్ద గుజ్జుల్, చిన్న గుజ్జుల్, లొంక తండా తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజలు మంగళహారతులు, పూల దండలతో స్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చానని, మిగిలిన సమస్యలు పరిష్కరిస్తానన్నారు. గ్రామాలు, తండాల్లో మిషన్ భగీరథతో అధిక శాతం తాగు నీటి సమస్య తీరిందన్నారు. సాగు నీటి కోసం కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులను పూర్తి చేయిస్తానని, దీంతో మండలంలో సాగు నీటి సమస్య తీరి రైతులకు మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ నేతలు అమలకు సాధ్యం కాని హామీలిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి గెలిపించాలని ఓటర్లను కోరారు.

ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు

- మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్



లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డిలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 30న జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జాజాల సురేందర్ గెలుపు ఖాయమైందన్నారు. రాష్ట్రంలో మూడో సారి కేసీఆర్ సీఎం కాబోతున్నారన్నారు. రాంపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్, శెట్పల్లిసంగారెడ్డి అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, శ్రీకాంత్, సురేందర్‌గౌడ్, ఫారూఖ్, అంజద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో నేతల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డులతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి జాజాల సురేందర్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు కుడుముల సత్యం, జలందర్‌రెడ్డి, సతీష్ తదితరులున్నారు.

ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటేయాలి

- జుక్కల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే

నిజాంసాగర్(జుక్కల్): అన్ని రంగాల్లో వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం, ప్రజా సేవ కోసం ఇంజినీర్ ఉద్యోగాన్ని గడ్డిపోసలా వదిలివేశానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. శనివారం జుక్కల్‌మండలంలాడేగాం, పెద్ద ఎడ్గి, కత్తల్‌వాడి, బిజ్జల్‌వాడి, నాగుల్‌గావ్, మాదాపూర్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు సింధేకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ప్రజలు ఆగం కావొద్దని ఆలోచించి ఓటు వేయాలన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలకు లోకల్ అభ్యర్థులు లేక నాన్ లోకల్ వారికి టికెట్లు ఇచ్చారన్నారు. సుగ్గి కోసం వచ్చే వారికి ఓట్లు వేయవద్దని లోకల్ అయిన తనకు కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రజలకు ఏ ఆపద వచ్చినా ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు నీలు పటేల్, శివానంద్, సాయాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ఉజ్వల భవిష్యత్తు

- కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సురభి ద్వివేది



బిచ్కుంద(జుక్కల్): యువకులకు కాంగ్రెస్‌తోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని, కాంగ్రెస్ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురభి ద్వివేది అన్నారు. శనివారం బిచ్కుందలో యువజన కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురభి మాట్లాడుతూ.. కార్యకర్తలు పార్టీకి మూల స్తంభాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టో పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉందని, ఆరు పథకాలు ప్రజలలో తీసుకెళ్లి అవగాహన కల్పించి ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీకాంతరావు గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. నాయకులు రాంమోహన్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ విఠల్ రెడ్డి, కమల్ కిషోర్, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాషా పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే కులవృత్తులకు జీవం

- మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో కేసీఆర్ హయాంలోనే అన్ని కులవృత్తులకు జీవం లభించిందని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో ప్రభుత్వాలు ఎరుకల ప్రధాన వృత్తి అయిన పందుల పెంపకాన్ని బ్యాన్ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం సీఎం కేసీఆర్ ఎరుకుల సొసైటీ ఏర్పాటు చేసి ప్రత్యేక ఫాంల ద్వారా పందుల పెంపకానికి రూ.60 కోట్లను కేటాయించారని గుర్తు చేశారు. ఒక్కో మండలంలో 2 నుంచి 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సొసైటీలకు కోసం కేటాయిస్తామని తెలిపారు. ప్రతిపక్షాలు చెప్పే మాయమాటలు నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్‌లో అందరూ సీఎం అవుతారని చెప్పుకునే పరిస్థితి ఉందన్నారు. ఆయన వెంట ఎరుకల సంఘం రాష్ట్ర కోశాధికారి రవి కుమార్ ఉన్నారు.

నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లో ప్రచారం



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని గాలీపూర్, ముగ్దుంపూర్ గ్రామాల్లో జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు గడప గడపకు తిరుగుతూ కారు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ నుంచి యువకులు, మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి, మంగ్లూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నేతలు దుర్గారెడ్డి, నర్సింహారెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు.

పోచారంను భారీ మెజార్టీతో గెలిపించాలి



బాన్సువాడ: ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్

బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో శనివారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. బీర్కూర్ మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ స్వరూప, యూత్ అధ్యక్షుడు శశికాంత్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

బాన్సువాడ రూరల్: మొగులాన్‌పల్లి, తాడ్కోల్, బుడ్మి, ఇబ్రహీంపేట్, బోర్లం, దేశాయిపేట్ తదితర గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం చేపట్టారు. పోచారంను గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షులు మోహన్‌నాయక్, నాయకులు అంజిరెడ్డి, పిట్ల శ్రీధర్, గోపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ మాట్లాడుతూ.. పని చేసే నాయకులకే ఓటు వేయాలన్నారు. నాయకులు కందిమల్లేష్, మైశాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.




మొగులాన్‌పల్లి తండాలో..



నస్రుల్లాబాద్‌లో..

మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం



భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి, కాచాపూర్ గ్రామాల్లో సీఎం కేసీఆర్ తరఫున ప్రచారానికి వచ్చిన మంత్రి కేటీఆర్‌కు శనివారం బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. పెద్దమల్లారెడ్డిలో కేటీఆర్‌ను గజమాలతో స్వాగతం పలికారు. గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీపీ జాంగారి గాలిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, నేతలు నిట్టు వేణుగోపాల్‌రావు, వేణుగోపాల్‌గౌడ్, నల్లవెల్లి అశోక్, పెద్దమల్లారెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మిరాజలింగం , సులోచన, తున్కి వేణు, తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో ఇందిరమ్మ రాజ్యం

- ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు



మదన్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

గాంధారి(ఎల్లారెడ్డి): తెలంగాణలో మూడు నెలల్లో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటవుతుందని ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు అన్నారు. శనివారం ఆయన మండలంలో పర్యటించి పలు తండాలు, గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జాజాల సురేందర్ మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. తండాల్లో రోడ్లు, మురికి కాలువలు అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు. చేతి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా మార్చుతానని హామీ ఇచ్చారు. మండలంలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయిస్తానన్నారు. రైతులకు నాణ్యమైన ఉచిత కరెంటుతో పాటు రైతుల సంక్షేమం కోసం పథకాలు ప్రవేశపెడతామన్నారు. గెలిపిస్తే తన జీతం నియోజకవర్గం అభివృద్ధికే వినియోగిస్తానని స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించి ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు.

తాడ్వాయిలో జోరుగా ప్రచారం



చిట్యాలలో పథకాల గురించి వివరిస్తున్న నేతలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శనివారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో విఠల్, బాబు, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

'మదన్‌మోహన్ రావుకే టీడీపీ మద్దతు'

రామారెడ్డి: ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న మదన్ మోహన్‌రావుకే తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని ఎల్లారెడ్డి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మోడెగాం మహేష్ తెలిపారు. రామారెడ్డి మండల కేంద్రంలో శనివారం భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థికే తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. చందాలు వేసి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అమ్ముడుపోయిన ఎమ్మెల్యే సురేందర్‌ను ఓడించి బుద్ధి చెప్తామన్నారు.

కామారెడ్డి భూముల కోసమే కేసీఆర్ పోటీ

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి రూరల్/భిక్కనూరు: కామారెడ్డిలో పంట పొలాల ను కబ్జా చేయడానికే సీఎం కేసీఆర్ పోటీ చేస్తు న్నారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించా రు. శనివారం కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డిలో కార్నర్ మీటింగ్‌లో, భిక్కనూరు మండల కేంద్రంలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని షబ్బీర్‌అలీ మాట్లాడారు. తాను రేవంత్‌రెడ్డి వేర్వేరు కాదని, రాష్ట్రంలో ఇద్దరం పెద్ద నాయకులమేనని పేర్కొన్నారు. తనతోపాటు రేవంత్ రెడ్డి గొంతులో ప్రాణం ఉండగా కామారెడ్డిలోని గజం భూమిని కూడా కబ్జాకు గురికాకుండా అడ్డుకుంటామన్నారు. కేసీఆర్‌ను ఓడించే దమ్మున్న లీడర్ రేవంత్ రెడ్డి కాబట్టే సోనియా గాంధీ ఆయనను కామారెడ్డి నుంచి బరిలో దింపారన్నారు. మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే యూసుఫ్ అలీ, కైలాస్ శ్రీనివాస్‌రావు, కారంగుల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన ఆర్యవైశ్య ప్రముఖులు



ప్రభుత్వ విప్ సమక్షంలో చేరుతున్న ఆర్యవైశ్యులు



ఎంపీపీ సమక్షంలో చేరుతున్న అక్కాపూర్‌వాసులు

కామారెడ్డి టౌన్/భిక్కనూరు: కామారెడ్డి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు, అలాగే భిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత స్వామిగౌడ్ శనివారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆర్యవైశ్యులు విశ్వనాథుల రాజేందర్, పేపర్ శ్రీను, యాద అంజయ్య, విరమల్లి శ్రీను, అతిమాముల శశిధర్, కోవూరి శ్రీను, పిప్పిరి శేఖర్ తదితరులు పార్టీలో చేరారు. వీరికి గంప గోవర్ధన్ కండువాలు వేసి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, నాయకులు ముప్పారపు ఆనంద్, కుంబాల రవి, భిక్కనూరు ఎంపీటీసీల ఫోరమ్ మండలాధ్యక్షుడు ద్యావర సాయిరెడ్డి, నేతలు తాటికొండ బాబు, రాజయ్య, వంగేటి చిన్న నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన అక్కాపూర్ గ్రామస్తులు

మాచారెడ్డి: అక్కాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు 35 మంది శనివారం ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ను గెలిపిస్తే కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. నాయకులు బుచ్చిరెడ్డి, బాబు, ఎల్లయ్య, శ్యామ్, లక్ష్మీపతి, మహేష్ ఉన్నారు.

గజ్యానాయక్‌తండా చౌరస్తాలో ప్రచారం

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్‌తండా చౌరస్తాలో శనివారం సర్పంచ్ హంజినాయక్ ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌కు బీడీ కాంగార్ ఫెడరేషన్ మద్దతు



కామారెడ్డి రూరల్: కేసీఆర్ హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు పోతుందని, కామారెడ్డి మరింత అభివృద్ధి చెందడానికి సీఎం కేసీఆర్ గెలుపునకు తెలంగాణ బీడీ కాంగార్ ఫెడరేషన్ తమ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు శివ్వంది సత్యం, ప్రధాన కార్యదర్శి ఉప్పు లక్ష్మణ్‌లు తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను బీడీ కార్ఖానాల్లో మహిళలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అభివృద్ధి కోసం సీఎంను గెలిపించుకోవాలి



కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: కామారెడ్డి 100 రెట్లు ఎక్కువగా అభివృద్ధి జరగాలంటే కామారెడ్డి సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని 33, 34, 36 వార్డుల్లో కేసీఆర్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. కౌన్సిలర్లు నిట్టు కృష్ణమోహన్, పంపరి లత, నాయకులు అర్చన, శివారెడ్డి ఉన్నారు.

సాదాసీదాగా సర్వ సభ్య సమావేశం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎన్నికల సమయం కావడంతో అన్ని శాఖల అధికారులు హాజరవ్వలేదని ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు మూడు నెలల క్రితం నుంచి జరిగిన అభివృద్ధి పనుల నివేదికలను చదివి వినిపించారు. ఎంపీపీ పాల్త్య విఠల్, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో రాము, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



మాచారెడ్డి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు శనివారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చిత్రపటానికి మాచారెడ్డిలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏడాదికి రూ.12వేలు, మేజర్ సిటీలో ఆటోనగర్ ఏర్పాటు, ట్రాఫిక్ చలాన్లపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమని అన్నారు. అనంతరం ఆటోలతో ర్యాలీ నిర్వహించారు.

విద్యావంతులను చేయడమే 'తొలిమెట్టు' ఉద్దేశం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రతి ఒక్కరిని విద్యావంతులుగా చేయడమే తొలిమెట్టు ఉద్దేశమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఎన్ఎస్ఎస్ విద్యార్థి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోని చిన్నారులకు విద్యను నేర్పించడం చాలా సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరిని విద్యావంతులను చేయాలని అన్నారు.

'తొలిమెట్టు'కు తరలిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శనివారం వారికి కేటాయించిన పాఠశాలల్లో విద్యాబోధనకు తరలివెళ్లారు. కార్యక్రమంలో భాగంగా 5వ తరగతి లోపు విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. సర్టిఫికేట్లు అందజేశారు.